క్లుప్తంగా

4న సర్వసభ్య సమావేశం

గిద్దలూరు రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 4వ తేదీ ఉదయం 11 గంటలకు ఎంపీపీ కడప లక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హేమలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

గ్రామాభివృద్ధిపై అవగాహన సదస్సు

దొనకొండ: మండలంలోని పోలేపల్లిలో ఎఫర్డ్ సంస్థ ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్ ఉమాదేవి గ్రామాభివృద్ధిపై బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామం అభివృద్ధి చెందాలంటే సాగు, తాగు నీరు, విద్యా, వైద్యం ఉన్నప్పుడే జరుగుతుందన్నారు. దీంతో కుటుంబాల్లో జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ చెట్లు నాటాలని, చెట్లతో వాతావరణంలో మార్పులు వచ్చి వర్షాలు కురుస్తాయని గ్రామస్తులకు వివరించారు. ఎఫర్డ్ టీమ్ జెస్సీగ్లోరీ పాల్గొన్నారు.

ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు


ముండ్లమూరు: సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు చేపడుతున్న ప్రజారక్షణ భేరిని జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం సీపీఎం నాయకులు పోస్టర్‌ను వేంపాడులో ఆవిష్కరించారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. బీజేపీ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని గ్రామాల్లో ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. విభజన హామీల అమలులో నిర్లక్ష్యం విడనాడి తక్షణమే అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు కోరారు. కార్యక్రమంలో ప్రచార కమిటీ సభ్యులు పంటా ఏడుకొండలు, గాలి వెంకటేశ్వర్లు, గంగినేని సత్యనారాయణ, షేక్ మీరావలి, పాలపర్తి యాకోబు పాల్గొన్నారు.

అంతర్ పంటలు లాభసాటి


బంతిసాగును పరిశీలించి సూచనలిస్తున్న ఏపీ

తాళ్లూరు (ముండ్లమూరు): ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో అన్ని కాలాల్లో ప్రతి ఒక్కరూ చేయవచ్చని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. మండలంలోని నాగంబొట్లపాలెంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ పంటలో అంతర్ పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంతి పూల సాగు రైతులకు లాభసాటిగా ఉంటుందన్నారు. ప్రస్తుతం ఎర్రబంతి, పసుపుబంతి సాగుకు అనుకూలంగా ఉందన్నారు. మార్కెట్లో వాటికి డిమాండ్ ఉందన్నారు. తెగుళ్ల నుంచి కాపాడుకునేందుకు తక్కువ ఖర్చుతో తయారు చేసుకునే కషాయాలను వాడుకోవచ్చన్నారు. ప్రకృతి సాగు ఇన్‌చార్జి నరసింహులు, వీఏఏ శ్రీను, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన వెంకటరామిరెడ్డి

బేస్తవారిపేట: ఆర్టీసీ బస్సును వెనుక వైపున మోటార్ సైకిల్ ఢీకొట్టడంతో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన బేస్తవారిపేటలోని పాత సినిమా హాల్ సెంటర్ సమీపంలో బుధవారం జరిగింది. కనిగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్ కంభం నుంచి బేస్తవారిపేట వైపునకు వెళ్తోంది. అదే రూట్‌లో బస్ వెనుక వైపున మోటార్ సైకిల్‌పై అర్ధవీడు మండలం బోగోలుకు చెందిన వెంకటరామిరెడ్డి వెళ్తున్నాడు. బేస్తవారిపేట సమీపంలోని పాత సినిమా హాల్ సెంటర్ సమీపంలోని ఎస్సీ కాలనీ వద్ద బస్‌ను తోకపల్లె–కడప హైవే రోడ్డుపై ప్రయాణికులు దిగేందుకు నిలపడంతో వెనుక వైపున మోటార్ సైకిల్ ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకటరామిరెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో

మార్కాపురం రూరల్: అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొట్టిన సంఘటన మండలంలోని కోలభీమునిపాడు వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కె.కొత్తపల్లి గ్రామానికి చెందిన సుబ్బయ్య మార్కాపురంలో పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా కోలభీమునిపాడు వద్ద అతివేగంగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. సుబ్బయ్యకు కాలు విరగడంతో 108లో మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నర్సరావుపేటకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు మార్కాపురం రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ తెలిపారు.


మార్కాపురంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మున్సిపల్ చైర్మన్


పొదిలిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు


యర్రగొండపాలెంలో..

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

మార్కాపురం: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని బుధవారం పట్టణంలోని వివిధ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అవతరణకు ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో కమిషనర్ గిరికుమార్, డీఈ సుభానీ, కౌన్సిలర్లు బుశ్శెట్టి నాగేశ్వరరావు, సిరాజ్, కొత్త కృష్ణ, షెక్షావలి, నాయకులు శ్రీనివాసులు, ఉత్తమ్‌కుమార్, డీవీ వెంకటేశ్వర్లు, ఏఈ ఆదినారాయణ, మేనేజర్ శ్రీనివాసన్ పాల్గొన్నారు.

పొదిలి రూరల్: పొదిలిలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిశాల వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంస్థ కన్వీనర్ కాకునూరి యలమందారెడ్డి, డైరెక్టర్ గునుపూడి చెంచు సుబ్బారావు, కార్యదర్శి తాడికొండ వెంకటరావు, ఉపాధ్యక్షుడు బండి అశోక్, సామిరాజు, మేడా శ్రీనివాసరావు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, గ్రంథాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. బేస్తవారిపేట జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎం కర్నాటి తిరుపతిరెడ్డి, గ్రంథాలయంలో గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణలో పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని పలువురు వక్తలు కొనియాడారు.

యర్రగొండపాలెం: రాష్ట్ర అవతరణకోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు జయంతిని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం, శాఖ గ్రంథాలయంలలో ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, ఎంపీడీవో వైవీ నాగేశ్వరప్రసాద్, ఎంఈవో పి.ఆంజనేయులు, ఈవోపీఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి, ఎస్.వెంకటరెడ్డి, గ్రంథ పాలకురాలు కె.ఝాన్సీ, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక తహసీల్దార్ డి.సీతారామయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది తమ కార్యాలయంలో బుధవారం అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తహసీల్దార్ సీతారామయ్య మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన మహానుభావుడు పొట్టిశ్రీరాములు అని కొనియాడారు. పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద బీజేపీ నాయకులు డాక్టర్ జేవీ నారాయణ, రామాంజనేయులు, చంద్రమోహన్‌లు ఘనంగా నివాళులర్పించారు.

ముండ్లమూరు: రాష్ట్ర అవతరణ దినోత్సవం బుధవారం మండల కేంద్రం ముండ్లమూరులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు పులికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదన్నారు. రాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన త్యాగమూర్తి అని ఆయన త్యాగాలను కొనియాడారు. ఆర్యవైశ్య జిల్లా జాయింట్ సెక్రటరి దేవతి శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షులు శిఖాకొల్లి సుబ్బారావు, నాయకులు సుధాకర్, కాంతారావు, శ్రీనివాసరావు, ఆంజనేయులు, దళిత సంఘ నాయకుడు పాలపోగు డగ్లస్ పాల్గొన్నారు.

పుల్లలచెరువు: భాషా ప్రయుక్త రాష్ట్రాల సాధన కోసం అహర్నిశలూ కృషి చేసి అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం అని ఎంపీపీ వెంకటయ్య అన్నారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో, స్థానిక గాంధీ కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పూల మాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీడీవో మరియదాసు, ఈవోఆర్డీ శరత్ బాబు, కార్యదర్శి బాలునాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ రఘు, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు గోపి, గాంధీ కళాక్షేత్రం కమిటీ సభ్యులు గురునాథం, హనుమంతరావు, డిష్ చిన్నా, రిటైర్ ఆర్మీ జవాన్ బుజ్జి, నాగేశ్వరరావు, కేశవ నారాయణరెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు. కేజీబీవీ పాఠశాలలో ప్రిన్స్‌పాల్ లిల్లీ ప్రకాశ్‌వాణి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి విద్యార్థులకు శ్రీరాములు గురించి వివరించారు.

కంభం: రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ చేగిరెడ్డి తులశమ్మ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జగదీష్, సర్పంచ్ పల్నాటి బోడయ్య, ఏఓ మస్తాన్‌వలి, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, కార్యదర్శులు బ్రహ్మయ్య, సుధాకర్, జ్యోత్స్నలు, షఫీ, స్వప్న, నరేష్, రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, డిష్ బాబు పాల్గొన్నారు.


బేస్తవారిపేటలో..


గిద్దలూరులో..


ముండ్లమూరులో..


పుల్లలచెరువులో..


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ

విశ్వసనీయతకు చిహ్నం జగన్

- ఇచ్చిన మాటకు కట్టుబడే ఏకైక నాయకుడు జగన్
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే కేపీ


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే కేపీ


ఎంపీ, ఎమ్మెల్యేలకు స్వాగతం పలుకుతున్న చిన్నారికట్ల నాయకులు, ప్రజలు

కొనకనమిట్ల: విశ్వసనీయతకు కట్టుబడిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మార్కాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని చినారికట్ల గ్రామ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, సర్పంచ్ గోసుల అనురాధ వెలుగొండయ్య, ఎంపీటీసీ ఉడుముల ధనలక్ష్మి బంగారురెడ్డి, గ్రామ పార్టీ కన్వీనర్ కంది వెంకటరెడ్డితో కలిసి నిర్వహించారు. ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే కేపీ గడప గడపకూ వెళ్లి గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. తొలుత ఎంపీ, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలకు మాజీ సర్పంచ్ ఉడుముల గురవారెడ్డి, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, కంది బాలవెంకటరెడ్డి, వెలుగొండారెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీతో అపూర్వ స్వాగతం పలికారు. గడప గడపలో మహిళలు తిలకం దిద్ది హారతులిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి, పీఆర్ డీఈ శ్రీధర్‌రెడ్డి, సచివాలయ కార్యదర్శి, సొసైటీ చైర్మన్లు కామసాని వెంకటేశ్వరరెడ్డి, ఉడుముల కాశిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సూరవరపు పెదవెంకటరెడ్డి, మర్రిపూడి ఎంపీపీ వాకా రమణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గుజ్జుల రమణారెడ్డి, స్థానిక పార్టీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



తువ్వపాడులో ఆర్బీకేను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే


కొనకనమిట్ల-నాగంపల్లి రోడ్డు శిలాఫలకం ఆవిష్కరిస్తూ..


గార్లదిన్నెలో సచివాలయాన్ని ప్రారంభిస్తూ..

మూడు చక్రాల సైకిళ్ల పంపిణీ


మూడు చక్రాల సైకిళ్లతో లబ్ధిదారులు

కురిచేడు: మండలంలోని కల్లూరులో అంగవైకల్యం వారికి మూడు చక్రాల సైకిళ్లు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ కన్వీనర్, వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా చిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంగవైకల్యం గల వారి సమస్యను సకాలంలో స్పందించి వారికి మూడు చక్రాల సైకిళ్లు అందజేయడంపై ముఖ్యంతి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు నక్కా ఆంజనేయులు, పోలేబోయిన పెద్దపెదయ్య, ఎంపీయూపీ స్కూల్ చైర్మన్ నక్కా చినబుల్లి కొండయ్య, హైస్కూల్ చైర్మన్ వల్లెం నారాయణ, నాయకులు పోతురాజు, శ్రీను, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ.13.89 కోట్లు

- సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.13.89 కోట్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి వెల్లడించారు. బుధవారం మార్కాపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. రోడ్ల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. మార్కాపురం-కంభం వయా చింతగుంట్ల, కొట్టాలపల్లి, వేములపేట రోడ్డు నిర్మాణానికి రూ.2.22 కోట్లు, బిరుదులనరవ నుంచి బొడిచర్ల వయా తిప్పాయపాలెం, మాల్యవంతునిపాడు రోడ్డు నిర్మాణానికి రూ.7 కోట్లు, కొనకనమిట్ల మండలం మునగపాడు-కొండాయపాలెం వయా మంగాపురం రోడ్డు నిర్మాణానికి రూ.4.67 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారని ఎమ్మెల్యే వివరించారు. మార్కాపురం-కంభం రోడ్డును 4.5 కి.మీ, బిరుదులనరవ-బొడిచర్ల రోడ్డును 7.2 కి.మీ, మునగపాడు-కొండాయపాలెం రోడ్డును 6.2 కి.మీ మేర నిర్మించనున్నట్లు తెలిపారు. మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి సారించడం వల్లే మెడికల్ కాలేజీ, పొదిలి పెద్దచెరువుకు సాగర్ నీరు, మార్కాపురం పట్టణంలో సాగర్ పైపులైన్ల మరమ్మతులు, నూతన పైపులైన్ల ఏర్పాటుకు నిధులు వచ్చాయని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు.

బట్టీ పట్టే విధానానికి విద్యార్థులు స్వస్తి పలకాలి


మాట్లాడుతున్న డాక్టర్ శరత్

మార్కాపురం: విద్యార్థులు పరీక్షల ముందు బట్టీ పట్టే విధానానికి స్వస్తి పలకాలని జనవిజ్ఞాన వేదిక డివిజన్ కార్యదర్శి, ప్రముఖ వైద్యుడు డాక్టర్ బి.శరత్ సూచించారు. బుధవారం సాయంత్రం స్థానిక వాగ్దేవి జూనియర్ కళాశాలలో శాస్త్రీయ విజ్ఞానం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శరత్ మాట్లాడుతూ.. అవగాహనతో చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సైన్స్‌పై ఆసక్తి ప్రదర్శిస్తూ సత్యాలు తెలుసుకుని ఆచరించాలని చెప్పారు. భావిభారత శాస్త్రవేత్తలుగా రాణించాలని ఆకాంక్షించారు. అధ్యాపకులు ఏనుగుల రవికుమార్ మాట్లాడుతూ అంతరిక్షాల్లోనికి రాకెట్లను పంపే సాంకేతికత పెరిగినా ప్రజల్లో మూఢనమ్మకాలు ఉన్నాయన్నారు. ఆర్థికంగా నష్టం చేకూర్చే మూఢ నమ్మకాలను విడిచిపెట్టాలన్నారు. ప్రిన్సిపాల్ కె.సుబ్బారెడ్డి, డైరెక్టర్లు జి.శివారెడ్డి, మోహన్, కె.శ్రీనివాసులు, రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్టు వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కంభం: జన విజ్ఞాన వేదిక కంభం మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బోర్డు స్కూల్‌లో చెకుముకి టాలెంట్ టెస్టు వాల్‌పోస్టర్‌ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడుతూ మానవుని అభివృద్ధికి సైన్స్ ఎంతగానో దోహదపడుతోందన్నారు. నవంబర్ 10న మండల స్థాయిలో, నవంబరు 30న జిల్లా స్థాయి, డిసెంబర్ 17న రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని తెలిపారు. ఉపాధ్యాయులు శ్రీను, మణి, ఖుర్షీదు పాల్గొన్నారు.

ఎస్‌సీవీకే నిలయం అభివృద్ధికి కృషి


సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మార్కాపురం: మార్కాపురంలోని కొప్పరపు వెంకట కృష్ణ నిలయం(రీడింగ్ రూమ్) అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కార్యదర్శి గుంటక సుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఆయనను ఆటోనగర్ యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. 125 ఏళ్ల ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో తనను 10వ సారి చైర్మన్‌గా ఎన్నుకోవడం సంతోషంగా ఉందని, సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు. రీడింగ్ రూమ్ అభివృద్ధికి సహకరిస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎంఎస్ రెడ్డి, ఎమ్ఆర్‌కే బాషా, ఉపాధ్యక్షులు శాసనాల వీరబ్రహ్మం, బద్రీ తదితరులు పాల్గొన్నారు.

రైతులు మెళకువలు పాటించాలి


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

గిద్దలూరు రూరల్: రైతులు వ్యవసాయ రంగంలో మెళకువలు పాటించాలని స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ అన్నారు. వైఎస్సార్ పొలం బడి శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని గడికోటలో రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సంచాలకుల ద్వారా రైతులు వ్యవసాయంలో సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రతి రైతు వారి పంటలను ఈ-క్రాప్ చేయించుకోవాలన్నారు. యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ పద్ధతుల గురించి తెలుసుకోవాలన్నారు. ఏఓలు విజయభాస్కర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సంచాలకులు, సిబ్బంది పాల్గొన్నారు.